6 నెంబరుగది

ఇటూ అటూ కొండలు. మధ్యాహ్నం బస్సుప్రయాణం. జూన్ నాలుగో తారీఖు. కనపడే ప్రతికంకరగుట్టా ఒక అగ్నిపర్వతమై కూచుంది. ఎండ, నిప్పులు చెరిగిపోస్తోంది. తలకిందులపక్షులు చెట్లనుంచి రాలి పడుతున్నాయి.

రజోగుణప్రధానంగా బస్సు పరుగెత్తుతోంది.

గంధవరం లోకల్ ఫండు సత్రందగ్గర బస్ ఆగింది. ఒకరిద్దరు ప్రయాణీకులు దిగిసామాను సత్రంఅరుగుమీదికి చేరుస్తున్నారు.

నాకింక ప్రయాణించే ఓపిక లేదు. నాలిక తాటితాండ్రలా రసహీనమైపోయింది. శరీరం నిప్పులోంచిపైకి తీసినట్టుంది. మా వాడు అప్పుడే ఒక 'లెమన్ క్రష్' పుచ్చుకుని, పట్టణసమానిత 'ఖారాకిళ్ళీ' ఒకటి ఎడంబుగ్గని పదిలపరచి, పత్రిక విప్పాడు, తక్కిన 15 మైళ్ళప్రయాణానికి బద్ధకంకణుడై. ప్రయాణాల్లో మాత్రం మావాడు, "ఆరియు తేరిన వృద్ధ మూర్తి." నేనో వట్టిమెతక. నాసిము బాపతు.

మా వాణ్ణి ఎట్లాగో బతిమాలి, అప్పటికి ప్రయాణం ఆపి, మర్నాడుఉదయం బస్సులో ప్రయాణం చెయ్యడానికి ఒప్పించాను.

పెట్టెలు బెడ్డింగులు దింపి సరాసరిసత్రంలో ప్రవేశించి, మంచిగదిలో సామానుసర్దించి గుమాస్తాను కుశలప్రశ్న చేసి

మాట్లాడుతున్నాడు మావాడు. వాడికా ప్రాంత మంతా కొట్టిన పిండి.

నేను ముఖం కడుక్కుని, గుమస్తాగారి కూజాలోని మంచి నీళ్లు సగానికిపైగా పీల్చి, వడగొట్టినప్రాణాన్ని గదిలోపరుపు చుట్టకు చేరవేసి ఒక 'పాసింగ్ షో' వెలిగించి స్తిమితపడు తున్నాను.

'హల్లో' అంటే 'హల్లో' అనిఒకరినొకరు పలకరించు కొని మావాడు, మరోఆయన ఖులాసాగా మాటాడుకుంటూ గదిలో ప్రవేశించారు. కొత్తాయన సన్నగా — పల్చనగా చాకులా వున్నాడు. కొత్తతరహాకళ్లజోడు, చేతిలో లెదర్ బాగ్ ఉంది. రైల్వే నావెల్‌లా చవగ్గా సరదాగా మాటాడు తున్నాడు.

మావాడు ఉభయపక్షాలపరిచయం చేశాడు. "ఈయననాకు ముఖ్యస్నేహితుడు. ఇణ్స్యూరెన్సు ఏజంటు. పేరుగణేశంగారు. సరదామనిషి. సంగీతంమీద చాలా అభిమానం"........ "ఈయన మా అన్నగారు ఫలానా. బహుశాఎరిగేఉంటారు.

ఆధునికమర్యాదగా ఉభయులం నమస్కరించుకుని-అంతా లోకాభిరామాయణంలో పడ్డాం. సిగరెట్లహోమం పూర్ణా హుతిగా సాగుతోంది. ప్రణయకలాపం మొదలు పొగాకు పన్నుదాకా మాఇష్టాగోష్ఠి పరిగెత్తుతోంది.

గణేశంగారు సిగరెట్ పీకెను బయిటికి విసరడానికి ద్వారం దాకా వెళ్ళితిరిగివస్తూ తలుపువైపు ఆశ్చర్యంగా-నిదానంగా

చూసి పక్కన నవ్వాడు. ఎందుకల్లా నవ్వుతున్నారు అన్నాడు మావాడు కౌతుకంగా. గణేశం మళ్లానవ్వి అన్నాడు. "చూశారూ, తలుపుమీద నంబరు 6. సుమారు సంవత్సరం కిందట ఇక్కడ ఒక చిత్రం జరిగింది. తలుచుకున్నప్పుడల్లా నవ్వొస్తుంది." అని నావైపు తిరిగి "అన్నగారూ, సమయస్ఫూర్తి చెప్పవలసివచ్చినప్పుడు ఆడవాళ్ళదండీ—ఒకోక్క క్రిటికల్ సిట్యుయేషన్‌లో స్త్రీ ఒక ఠస్సా వేసిందంటే బ్రహ్మభేద్యంగా ఉంటుంది. లేకపోతే ఆనాడు నాభవిష్యంపోయి, అమర్యాద పాలైపోయి ఉండునంటే నమ్మండి. "ఏంజరిగిం దేమిటండి" అన్నానుకుతూహలంగా పరుపును జేరబడ్డవాడను లేచికూర్చుని.

గణేశం కొత్తసిగరెట్ సంధించి దాని అంచుకు సవరించి అంటించి 'ఏం జరిగిందంటే' అని ఉపక్రమించాడు.

2

ఒకసారి మాకంపెనీ ఆర్గనైజరు మంగపతిరావు నాయుడు గారూ నేనూ నెలరోజులు ఈసత్రంలో మకాంవేశాం. ముందుగా నేనూ తర్వాతవారంరోజులకు ఆయనావచ్చి, చెరోగదిలోనూ ఉన్నాం. ఆ ఎదురుగాకనపడే తూర్పువైపు పెద్దగదిలో నా బస. బిజినెస్‌కోసం నానాశ్రమలూ పడ్డాం. మానాయుడు భీమావిషయంలో మహాఘటకుడు. ప్రజలు త్రిప్పినన్నాళ్లూ తిరిగి చివ్వరికి పాతికమందిని పడగొట్టి, సుమారు ఏభైవేల దాకా బిజినెస్ చేయించి నాతో అన్నాడు. "చూశావా

పంతులూ! ఈ వ్యాపారంలో పట్టుగుంటే మరి వదలగూడదు. ఇదే పప్పుదప్పళం బ్రాహ్మడైతే వినుగెత్తి పారిపోను" అని విజయశంఖం ఊదాడు.

నిజానికి మా నాయుడికి బ్రహ్మద్వేషం లేదు. మంచి సాయిలా ఫాయిలా మనిషి. బ్రాహ్మణ యువకుల్లోని నిర్వ్యాపారత చూస్తే అతనికి కోపం. వింతమనిషి లెండి. సంగీతమంటే ప్రాణం. కవిత్వమంటే తిక్కవాడు.

ఆ వేళతో మా బిజినెస్ అంతా పూర్తి అయిపోయింది. వ్యాపారం పట్ల పెద్దపులిలా మీదపడే నాయుడు ఆరోజున నవనీతంగా మారి పరమహుషారుగా ఉన్నాడు. తెల్లవారితే ప్రయాణం కట్టి విశాఖపట్నం వెళిపోతాడు. ఆరాత్రి— ఈ నెలరోజుల్లోనూ స్నేహితులైన చుట్టుపట్లవారిని నలుగురినీ పోగుచేసి తనగదిలో గానా బజానా ఏర్పాటుచేశాడు. ఈ నాటి మార్కెట్టులో చెలామణీ అయే తెనుగు హిందీ సినిమా పాటలు తున్నంగా పాడే ఒకకుర్రాణ్ణి సంపాదించి తీసుకువచ్చాను నేను. నాయుడు గదిఅంతటా మంచిరకం అగరువత్తులు వెలిగించి, బత్తాయితొనలు, ఏపిలుముక్కలూ, బిస్కెట్లూ రెండుమూడు పళ్లాల్లో అమర్చాడు. పైనాపిల్, విమ్‌టోరోజ్ ఇత్యాది డ్రింకులు రెండుకేసుల్లో సిద్ధంగా ఉన్నాయి. చుట్టల కట్టలు, సిగరెట్ టిన్నులు వగైరా ఉత్సాహసామగ్రి 'జాగర్త' పరచాడు. నేనేపనైనా ముట్టుగోపోతే మీరు శ్రమపడితే నేను ఒప్పను. మీరుకూడా నాకీవేళ ఒకవిలువైన అతిథిగా ఉండాలి

అనినవ్వుతూ ఆజ్ఞాపించి ఆసంగీతపుకుర్రాడికి కీ ఇచ్చి విడిచి పెట్టాడు. వాడు ‘నిద్రమేలుకోరా తమ్ముడా’ మొదలు ‘సుఖ్ కే దుఖ్ కే’ దాకా అమృతప్రవాహంలా—తారాజువ్వలా పాడుకుపోతున్నాడు.

మిత్రులంతా డ్రింకులు సేవిస్తూ పొగలుకక్కుతూ తన్మయంగా సంగీతంలో తలమున్కలై వింటున్నారు. చీమకదిలితే వినబడుతోంది. ఈ సంగీతకోలాహలానికి—ఎక్కడినుంచి వచ్చి పడ్డదో ఒకజనప్రవాహం గదిలోకి కొట్టుకువచ్చింది. అంతా ఒకసైజు కుర్రాళ్ళు. షరాయిలు, గళ్లలుంగీలు, లాల్చీలు, చేతుల్లేని బనీనుల్లు అంతా నవనాగరికజాతి. క్రితంరోజున అనకాపల్లినుంచి పెళ్ళివారొకరు నాలుగుబళ్లతో వచ్చి సత్రంలో దిగారు. ఇప్పుడుమనం కూచున్న ఈ ప్రాంతం అంతా పెళ్లివారితో నిండిపోయింది. వారంతా ఏదో పెద్దకుటుంబాలకు చెందినవారు. స్త్రీలూ, పురుషులూ చాలా ‘స్టయిలిష్’గా ఉన్నారు. అవి బాణసంచాలుకావు, ఊరేగింపులు కావు, మేజువాణీలు కావు, ధణుతెగరగొట్టేశారు. రాత్రి ఒకరెప్ప పాటు నిద్దరలేదు. పంచాగ్నిమధ్యంలా వారిమధ్యని నాగది ఉండిపోయింది. కాని, తెల్లవారింతరవాత వారందరినీ చూస్తే రాత్రి నిద్రలేనికోసం మంచులా విడిపోయింది.

మా నాయుడు పెళ్లివారికుర్రాళ్లని సగౌరవంగా ‘రిసీవ్’ చేసుకుని ఒహాలుథా సత్కరించి కూర్చోబెట్టాడు.

పాట మధుసేవలా నరాల్లో నిషావుట్టించి ఎవ్వరినీ కదల నివ్వడంలేదు.

ఉత్తరంవైపు హాల్లో పెళ్ళివారి ఆడవారు నవ్వులతో హాస్యాలతో మహాహడావిడిగా సాగించే బంతులాటకూడా పూర్తికావచ్చింది. ఒక్కరొక్కరే లేచి వెళుతున్నారు. గాస్ లైట్లు మసకగా వెలుగుతున్నాయి. నాకు నిద్రకూరుకువస్తోంది. నాయుడుగారు చూస్తే కదలనివ్వరు. దగ్గి ఇవతలకి వచ్చి నా గదివైపు జారాను.

3

నిద్రకళ్ళతో వెళ్ళి నా గదితలుపులు తోశాను తలుపులు విడుతూండగానే తలతిరిగిపోయేటంత సన్నజాజిపూలవాసన గుప్పున కొట్టింది. నాకుప్రాణంలేదు. నెళ్ళాళ్ళనుంచి ఈసత్తరపు కొయ్యబల్లలమీద నిర్బంధబ్రహ్మచర్యం ఆచరించే నాగది లోంచి ఈ 'మగువపాలువు దెలుపు నొక్కమ రుతం' ఏమిటి?

నిద్రకళ్ళను బాగా తెరవడానికి ప్రయత్నిస్తున్నాను. ఒక వేళ నాయుడుగారి గదిలోనే ఉండి పాటసుఖంలో తియ్యని కలలు కనడంలేదుగదా! అనుకున్నాను.

కళ్ళువిదలించి మళ్ళా నిదానంగా చూశాను. సందేహం లేదు. ఎదటకనబడేది చక్కని పదహారేండ్ల అందాలు. సన్నని తెల్లజరీచీర కట్టుకుంది. జడనిండా జాజిపూలు. గోడ

వైపుతిరిగి కాంపు కాటుమీద పరుపుదులిపి పక్క వేస్తున్నది. హరికేన్ లాంతరు ఒకటి బాగా తగ్గి వెలుగుతోంది.

ఇదేమిటి? ప్రవరాఖ్యుడి ప్రాణానికి వరూధినిలా నామార్గంలో ఈవిడెట్లా వచ్చిపడ్డది? ముప్పావుగంటకిందట తలుపులు దగ్గరగా చేరవేసి వెళ్ళినగదిలో ఈఅప్సరస ఎట్లా పుట్టుకు వచ్చింది? ఈ తలలోని ప్రశ్నపరంపరలతో ఆలోచిస్తూ అప్రయత్నంగా నాలుగడుగులు గదిలోకి వేశాను.

"అమ్మయ్య—సంగీతం ఇప్పటికేనా మిమ్మల్ని విడిచిపెట్టింది" అని తిరిగిచూచి హఠాత్తుగా నోటమాటరాక నిశ్చేష్టపడిపోయింది. నేనూఅట్లా గుడ్లప్పగించి చూస్తున్నాను. చట్టున తెలివి తెచ్చుకుని రెండడుగులు వెనక్కివేసి తిరిగి చూడకుండా వెళ్ళిపోతే సమస్య తెగిపోను. కాని మెదడు పనిచెయ్యదు. అడుగుముందుకూ వెనక్కూ పడదు.

ఒకొక్కప్పుడు హఠాత్తుగా ఏ అపూర్వ రాజాంతఃపురములోనో వెళ్లిపడ్డట్టు కల వస్తుంది. అద్భుతసౌందర్యంతో మెరసిపడుతూ రాణి చెలికత్తెలతో విహరిస్తూ కనపడుతుంది. వెనక తళతళలాడే విచ్చుకత్తులధారాలు, సిపాయిలు—రాజదండనం తలపునకువచ్చి హడలిపోతాం. కళ్లు ఎదటి సౌందర్య ప్రవాహాన్ని ఆబగా తాగుతూఉంటాయి. చప్పున నాలుగడుగులు వెనక్కివేసి పారిపోతే ప్రమాదం తప్పిపోతుంది. కాని, అవయవాలు పనిచెయ్యవు. మనస్సుకూ ఇంద్రియాలకూ సహాయనిరాకరణం. నాలుగు సెకన్లు గడిచిఉంటాయి.

గది గుమ్మం ముందు — మెట్లమీద - గదిలోకివస్తూ కలకటాస్లిప్పర్ చప్పుడవుతోంది.

కొంప మునిగింది. ఆమెభర్తఎవరోవచ్చి భీముడు కీచకుణ్ని గొంతునొక్కి చంపినట్టు చంపితే "ఎవరు నువ్వు-ఎందుకిట్లా వచ్చావు దొంగ దొంగ" అని కసికొద్దీ కేకలువేస్తే— చాలా ప్రమాదంలో పడ్డాను.

పక్కా తెలివయినపిల్ల స్థితి చప్పున గ్రహించింది. చట్టున కుడిచేత్తో ఎడంచెయ్యి చూపుడువేలు పట్టుకుని "అయ్యో-ఈవేలు గొడ్డలితో... చీల్చినట్టు బాధపెడుతోందండీ. అన్నయ్యగారూ! మీకు మంత్రం వచ్చునేమో వెయ్యండీ. అయ్యో-బతికేబాధ కాదండీ ఇది" అంటూ మంచంమీద కుప్పగాకూచుని బాధపడుతోంది. పాపం జుట్టుచెదరిపోయింది. కళ్ళు చెమ్మగిలాయి. అంత చక్కనిముఖం బాధతో అట్లా ముడతలు ముడతలుపడడం చూడలేకపోయాను" "అమ్మా భయంలేదు. ఒక్కనిమిషం మంత్రంవేస్తే సర్దుకుంటుంది. బాధ వచ్చినప్పుడే ఓర్చుకోవాలి" అక్కడ టేబిలుమీద ఉన్న జపాను సెల్యులాయిడ్ దువ్వెనతీసి వేలుమీద మంత్రించడం ప్రారంభించాను. ఇంతలో కలకటాస్లిప్పర్లధ్వని, ఒకపాతికేళ్ల యువకుడుగా మారి—ఆయన ఆత్రుతగా లోపలికి వచ్చాడు. ఆయన్నుచూచి ఆమెదుఃఖం మరింత హెచ్చింది. "ఇప్పుడే పరుపుతీసి పక్కవేస్తుంటే-ఎక్కడినుంచి వచ్చిందో మాయ తేలు చంపేసిందండీ—సమయానికి మీరులేరు. అన్నయ్యగారు నా

ఏడుపువిని పక్క గదిలోంచి పరిగెత్తుకువచ్చి మంత్రం వేస్తున్నారు" వేలు వెనక్కితీసికొని చేతుల్లో ముఖంపెట్టుకు కూచుంది ముఖకవళిక ఏదీ కనపడనివ్వకుండా. ఆయనదగ్గరగా వచ్చి "మరికొంచెంసేపు మంత్రం వేయించుకోరాకూ—బాగా నయంగా ఉంటుందేమో" అన్నాడు, పాపం. అతికష్టంమీద నవ్వాపుకుని నేనన్నాను. "ఇక అక్కరలేదండి. క్రమంగా అదే నయమవుతుంది. కాస్తమంత్రం పట్టివ్వాలి" ఆయన చాలా కృతజ్ఞత కనపరుస్తూ "శ్రమ ఇచ్చినందుకు క్షమించాలి. దైవంలా అడ్డుపడ్డారు—థాంక్స్" అన్నాడు మర్యాదగా.

నిజంగా నాకు దైవంలా అడ్డుపడ్డ ఆయనభార్యకూ మనస్సులో నమస్కారం చేశాను.

"అబ్బే దానికేమిటండి—బాధపడుతూవుంటే చూడగలనూ? పరిచయం లేకపోయినా చనవుతీసుకొన్నందుకు..." ఆయన అడ్డుకుని "చాల్లెండి—ఎంతమాట—" అనగానే ఆమె వైపు మళ్లా తిరిగి చూడకుండా ఆపత్తు దాటినట్టు ఆగది గుమ్మందాటి బైటపడ్డాను. తీరాతలుపువేసుచూస్తే—అది నా గదికాదు. ఆరోనెంబరుగది! పక్క 5 నంబరు గదిలో నాబస.

ఖర్మం—ఈ సత్రపుగదులన్నీ ఒకఅచ్చులో పోతపోసినట్టుంటాయి. ఆ అలమరలు, కిటికీలు, జల్లులు—అన్నీ ఒక్క తరహా—ఎంతపని జరిగింది! అనుకుంటూ నాగదిలోకి వెళ్ళి పడుకున్నాను.

అట్లా చరిత్రాత్మకమైంది ఈగది! నాటికినేడు ఈగదిలో" కాలుపెట్టాను. అని నవ్వుతూ గణేశంగారు కథపూర్తిచేశారు.

యతిప్రాసమహాసభ

క

తెల్లవారి చూసేసరికి సారంగధరుడి మెట్టమీద ఒక పెద్ద తాటాకుపందిరి. దాని పైనీ—కిందా—మామిడాకు తోరణాలు, రంగురంగుల జెండాలు, ఎరుపు, పచ్చ, నీలం కాగితాల గొలుసులూ, బుట్టలూ లేతగాలికి ఊగుతూ కన్నులపండువుగా కనిపిస్తున్నవి. ఆ పందిరికి చుట్టూ చినచిన్న కొత్త తాటాకు పాకలు అందంగా బారులు తీర్చి వీథులువీథులుగా ఉన్నాయి.

ఉదయం ౭ గంట లయింది. బాలసూర్యుని బంగారు కాంతిలో జైలురోడ్డు మొదలుకొని మెట్టదాకా 'దయచేయుఁడు. దయచేయుఁడు' అన్న ఆహ్వానపు అట్టలకు అంతు లేదు. వీరభద్రపురంనుంచి వీరేశలింగంతోటకు ఏదో పనిమీద పోతూన్న నన్ను చూసి మిత్రులు సూర్యనారాయణశాస్త్రిగారూ సీతాపతిగారూ తొందరగా వెడుతూ "శాస్త్రీ, చప్పున రావాలి. గొప్ప తమాషా జరిగిపోతోంది. పరుగులమీద పోవాలిర" న్మన్నారు. 'ఊఁ. ఏదో రాగిశాసనమో, మరణ